
ఆంధ్రభూమి వార పత్రిక పెద్ద కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి

# ధైర్యే సాహసే




మునిపల్లె లక్ష్మీరమణకుమారి

వర్షం జోరున పడుతోంది

కిటికీ ముందు నిలబడి వీధివైపు చూసింది గీతిక.

కిటికీలోంచి జల్లు వుండుండి గీతికని స్పృశించి పోతోంది.

వీధిలో ఎవరూ లేరు. తన బ్రతుకులాగే ఆ వీధి కూడా శూన్యంగా వుంది.



గీతిక నిట్టూర్చింది.

ఇంతలో దీపిక కారు వస్తూ కనిపించింది

కారు ఇంటిముందు పోర్టికోలోకి వచ్చి ఆగింది. దీపిక, ఇంకో మనిషెవరో కారు దిగుతున్నారు. అతను డోర్ వేస్తున్నాడు.

దీపిక చరచరా లోపలికి వచ్చింది.


''గీతా గీతా'' అని పిల్చింది.

గీతిక మేడదిగి వచ్చింది.

''నా పార్ట్‌నర్ ప్రకాష్ అని చెప్పానే. అతను వచ్చాడు. కాస్త టిఫిన్, టీ తీసుకురా'' అంది.

ప్రకాష్ లోపలికి వచ్చాడు.

అందంగానే వున్నాడు. వయసు ముప్పై వుండొచ్చు. అతన్ని చూడడం ఇదే మొదలైనా అతని గురించి బాగా తెలుసు గీతకి. దీపిక చెప్తూనే వుంటుంది.



ప్రకాష్ ఎం.ఏ పాసై ఉద్యోగంలేక తిరుగుతుంటే దీపిక చూసి జాలిపడి తన ఆఫీసులో ఉద్యోగం ఇచ్చింది. అతను తెలివీ, సామర్థ్యం కనిపెట్టి బిజినెస్‌లో పార్ట్‌నర్‌గా చేర్చుకుంది. ఆమె నమ్మకాన్ని అతను వమ్ము చేయలేదు. వ్యాపారాన్ని బాగా వృద్ధిచేసి, ఆమె అప్పుకూడా తీర్చేసుకున్నాడు.

ఇద్దరూ హాల్లో కూర్చున్నారు.

దీపిక లేచి, గబగబా మొహం కడుక్కుని పౌడర్ వేసుకుని వచ్చింది. ఫ్రెష్‌గా కనిపిస్తోంది. గులాబీ రంగు చుడీదార్ పైజామాలో చిన్నపిల్లలా వుంది.

ఇద్దరూ చెస్ బోర్డు ముందు కూర్చున్నారు. ఆట మంచి రంజులో వుండగా గీతిక బజ్జీల ప్లేట్లతో వచ్చింది.

''అబ్బా. ఇప్పుడేం వద్దు దీపికా'' అన్నాడతను.

''ఫర్వాలేదు. తీసుకో. మా గీతిక చేతి వంట తిన్నావంటే ఎన్ని ప్లేట్లయినా లాగిం చేస్తావు'' అంది దీపిక పగలబడి నవ్వుతూ.

గీతికని పరిచయం చేయలేదు. అతను అసలు గీతికని గుర్తించనట్లే మాట్లాడుతు న్నాడు.

ఖాళీ ట్రే తీసుకుని లోపలకు వెళ్లబోయి ంది గీతిక.

''గీతా... టీ మంచి స్ట్రాంగ్‌గా వుండాలి '' అంది దీపిక.

''అట్లాగే' అనేసి గీతిక అక్కడ్నుంచి వచ్చేసింది. తన పరిస్థితి తల్చుకుంటే తనకే జాలేస్తోంది. అసలు ఈ ఊరు రాకుండా వుండాల్సింది. అందుకే కదూ... చెడి చెల్లెలింటికి వెళ్లకూడదంటారు. దీపిక తనకి అక్క అయినా, అన్నింట్లోనూ చురుగ్గా వుండి చెల్లెలి లాగే కనిపిస్తుంది. దాని ముందు తను ఒక ముసలిదాన్లా, అప్పలమ్మ లా వున్నట్లు అనిపిస్తుంది తనకు.

ఆ స్పీడు, ఆ వేగం తట్టుకోవడం తనకి చేతకావడంలేదు. ఇంక బావ శ్రీధర్ ఎట్లా పడుతున్నాడబ్బా. తనైతే ఇలాంటి పెళ్లాం తో వేగగలిగేదేనా.

అయినా ఆడదైవుండి, పరాయి మగాడి తో ఎలా చదరంగం ఆడుతుందో...

ఎత్తుకి పైఎత్తులు వేస్తుంది.

ఎవరైనా దీపికముందు చిత్తుకావాల్సిందే.

టీ కూడా తాగి ఇంకో గంటసేపు ఆడాక వెళ్లిపోయాడు ప్రకాష్.

''గీతా'' దీపిక వంటింట్లోకి వచ్చింది.

''ఏంటి'' ప్రకాష్‌ని చూశావుగా. నీ అభిప్రాయం ఏంటి''

''నా అభిప్రాయం దేనికి'' అనుకోకుం డానే కరుగ్గా పలికింది గీతిక.

''ఏం లేదు... నీకూ ప్రకాష్‌కీ నచ్చితే మీ ఇద్దరికీ పెళ్లి కుదురుద్దామని''

''మాకిద్దరికీ పెళ్లా...'' నిర్ఘాంతపోయి చూసింది గీతిక.

''అవును. ఏం... అతనికి పెళ్లికాలేదు. నీకు విడాకులు అయ్యాయి. మీరిద్దరూ ఫ్రీ బర్డ్స్. మీ పెళ్లికి ఎవరి అభ్యంతరం మాత్రం ఏం వుంటుంది''

''నీ ప్రశ్నలోనే సమాధానం వుంది. నాకు పెళ్లయింది. ఒక కూతురుకూడా వుంది. అతను ఫ్రెష్ కాండిడేట్. మూల నున్న ముసలాడు కూడా పహారేళ్ల పడుచుపి ల్లనే చేసుకుంటానంటాడు. మరి అతను... వయసు, చదువు, సంపాదన, చక్కదనం, అన్నీ వున్నవాడు... నన్నెందుకు చేసుకుం టాడు'' కోపంగా అడిగేసింది గీతిక.

దీపిక నవ్వింది.

''అతను సరేనంటే...'' అంది.

''అప్పుడు ఆలోచిస్తాను''

''అయితే మరి ఇప్పుడే ఆలోచించు. అతను ఇందాకే సరేనని వెళ్లాడు. ఇంక నీ నిర్ణయమే కావాలి'' అని అక్కడ్నుంచి వెళ్లిపోయింది దీపిక.

గీతిక కోపంగా పెదవి కొరుక్కుంటూ నిల్చుండిపోయింది. అంటే... ఇందాక జరిగి నవి పెళ్లిచూపులన్నమాట.

తనికి ఒక్క మాటకూడా చెప్పకుండా

అరేంజ్ చేసింది. ఏమడిగీ లాభంలేదు. అవును ఇలాగే వుండాలి నాచురల్‌గా అని లెక్చర్ దంచుతుంది.

ప్రకాష్ ఎట్లా ఒప్పుకున్నాడో...

ఎందుకు ఒప్పుకోడూ... ఈ రోజుల్లో ఆడపిల్లకి పెళ్లి, ఏ మనిషికైనా సంపాదన, కావాలంటే ఎంతో కష్టం.

అట్లాంటిది... ప్రకాష్‌కి ఉద్యోగం ఇచ్చి తన సామర్ధ్యం నిరూపించుకునే అవకాశం ఇచ్చి, సంఘంలో ఒక స్థానం కలిగించిన మనిషి దీపిక.

దీపిక నిజంగా దీపమే. దగ్గరకు వెళ్తే ఎవరైనా శలభాల్లా మాడిపోతారు.

దీపిక ఒక సుడిగుండం... ఎవరైనా ఆ ఆకర్షణలో పడి కొట్టుకుపోవాల్సిందే.

ఎట్లాగో ఒకలా నచ్చచెప్పి వుంటుంది.

గీతికకి గతం గుర్తుకు వస్తోంది.

గీతకన్నా దీపిక రెండేళ్లు పెద్దది.

మామూలు మధ్యతరగతి కుటుంబం.

దీపిక బి.ఏ కాగానే పెళ్లి చేసేద్దాం అనుకున్నారు తల్లిదండ్రులు.

దీపిక ససేమిరా ఒప్పుకోలేదు.

"ముందు నా కాళ్లమీద నేను నిలబడాలి. అప్పుడే పెళ్లి" అంది.

"అదెప్పటికి జరుగుతుందో. నీ వెనకే గీత వుంది. దానికి కూడా పెళ్లివయసే. నీకే కాకపోతే ఇంక దాని పెళ్లెప్పుడు జరగాలి" అన్నారు తల్లిదండ్రులు.

"నా పెళ్లికీ దానిపెళ్లికీ లింకు దేనికీ. దానికిష్టమైతే చేసెయ్యండి. నన్నడిగితే మాత్రం చదువు పూర్తయి, దాని కాళ్లమీద అది నిలబడ్డాక చేస్తే మంచిది" అన్నది దీపిక.

"ఈ కాళ్లమీద నిలబడటాలూ, వేళ్లమీద నిలబడటాలూ కాదు. ఆడపిల్లకి ఈడు దాటిపోతే పెళ్లికావడం కష్టం" అనేసి గీతకి పెళ్లి సంబంధాలు చూడడం మొదలుపెట్టారు తల్లిదండ్రులు.

గీత కాదనలేదు. పైపెచ్చు సంతోషించింది.

## రచయిత

"నువ్వు రచనలు చేయడం మానేశావటగదా!"

"అవును! నిజమే..."

"ఎందుకని...?"

"ఓ వారం రోజులు క్రితం నన్ను ఘనంగా సన్మానించాల్లే..."

— బి.వి.యస్. బాబు(తెనాలి)



దీపిక తల్లిదండ్రుల మాట వినని పెంకిపిల్ల లా, తను అణకువగల ఆడదానిలా ఊహించు కునేసరికి ఎంతో ఆనందం కలిగింది.

గీతకి పెళ్ళి కుదిరింది. దీపికకి ఉద్యోగం దొరికింది.

హైదరాబాద్ వెళ్లింది. దీపిక ఎలా నెగ్గుకొస్తుందో చూడాలనిపించింది గీతకి.

ఈ రోజుల్లో ఆడపిల్ల ఒంటరిగా పరాయి ఊళ్లో నెగ్గుకురావడం అంటే మాటలా. ఏం జరుగుతుందోనని ఎదురుచూసింది.

గీత అనుకున్నట్లే జరిగింది.

దీపిక ఆఫీసరు పోకిరీ వాడు.

రాత్రిదాకా ఇంటికి పోనివ్వకుండా కూర్చోబెట్టడం, అవసరం లేకున్నా ఇంటికి పిలిపించడంలాంటి పనులు చేసేవాడు. వెకిలి చేష్టలు చేసి నవ్వేవాడు.

దీపిక ఊరుకోలేదు. అతనోసారి పిచ్చి చేష్టలు చేస్తే చెప్పు తీసుకుని కొట్టింది.

అంతే...

అది ప్రైవేటు ఉద్యోగం కావడం, అక్కడ ఆ ఆఫీసరుకి మంచి పలుకుబడి వుండడంవల్ల దీపికని ఉద్యోగంలోంచి తీసేసేటట్లు చూశాడు అతను.

దీపిక చెక్కు చెదర్లేదు.

"అసలు నేనే రిజైన్ చేసి పారేద్దాం అనుకున్నాను వెధవా. ఆ పని తప్పించావు" అనేసి వచ్చింది.

ఈ దెబ్బతో దీపిక మారిపోయి తన పంథా మార్చేసుకుంటుందనుకుంది గీత. కానీ అల్లా జరగలేదు.

మరోచోట ఉద్యోగం సంపాదించింది దీపిక.

ఇక్కడ ఆఫీసరు మంచివాడే. కానీ అతని అణువణువునా స్త్రీ ద్వేషం నిండిపోయి వుంది. అసలు అతనికి ఆఫీసులో ఆడవాళ్లని చేర్చుకోవడం ఇష్టంలేదు. సమయానికి సరైన మగ మనిషి దొరక్క అతను గీతికకి ఉద్యోగం ఇచ్చాడు. ఇచ్చేటప్పుడే మరో మగవాడెవరైనా తగినవాడు దొరకగానే తీసేస్తానని చెప్పి మరీ ఇచ్చాడు. ఈ లోపల ఊరికే వుండడం ఎందుకనో ఏమో, లోకంలో ఆడవాళ్లందరి మీది కసీ మాటల్లో వెళ్లగక్కేవాడు.

దీపిక ఊరుకోకుండా కొట్టినట్లు సమాధానం ఇచ్చేసేది.

చివరికి ఇంకో మగాడు, ఆఫీసరుకి వచ్చినవాడు రావడం, దీపికకి వీడ్కోలు ఇవ్వడం జరిగిపోయాయి.

ఇంకా కొన్ని ఉద్యోగాలు... ఒక్కోటీ ఒక్కోరకంగా విసుగు పుట్టించాయి.

చివరికి మరో ఉద్యోగం... అక్కడ ఆఫీసరు మంచివాడు... కానీ అదో మాదిరిగా వుంటాడు. దీపిక సమర్థతని గుర్తించడు. అసలు ఆవిడ ఆ ఆఫీసులో లేనట్లే ప్రవర్తిస్తాడు.

ఆయన భార్య ఒక అనుమాన పిశాచిట. అందుకే ఆయన ఆడవాళ్లతో అసలు ఏం మాట్లాడడుట.

అంతవరకూ బాగానే వుంది. కానీ దీపికకి రావాల్సిన ప్రమోషన్ అర్హతలు లేని ఒక అసమర్థుడికి ఇచ్చాడు. దీపికకి ఇస్తే పెళ్లాం అపార్థం చేసుకుని తంతుందని భయంట.

దీపిక ప్రమోషన్‌కోసం పోరాడింది.

ఆఫీసర్ పైవాళ్లని ఎట్లా కన్విన్స్ చేసుకున్నాడోగానీ అతని నిర్ణయమే సరైందని నిర్ణయించేశారు.

దీపిక కోపంతో ఊగిపోయింది. అక్కడే రాజీనామా చేసి, వాళ్ల మొహాన కొట్టి ఊరికి తిరిగి వచ్చింది.

ఇంక దీపికకి పెళ్లిచేసేస్తే మంచిదనిపించింది తల్లిదండ్రులకి. కానీ దీపిక కనీసం ఇప్పుడుకూడా ఒప్పుకోలేదు.

"మరేం చేస్తావే. నీ ఉద్యోగ విజయాలు చూశాంగా. ఇక పెళ్లిచేసుకో" అని అరిచింది తల్లి.

"నేనేమిటో నిరూపించుకోవటానికి ఉద్యోగమే అక్కర్లేదు" అన్నది దీపిక నిర్లక్ష్యంగా.

బాంక్‌నుంచి రుణం తెచ్చుకుని కుటీర పరిశ్రమగా బట్టలమీద అద్దకం, ఎంబ్రాయిడరీ వగైరా పనులు ప్రారంభించింది.

క్రమేణా వ్యాపారం చాలా బాగా వృద్ధి అయింది. పెద్ద బట్టల షాపు పెట్టి, ఫాషన్ దుస్తుల అమ్మకం మొదలుపెట్టింది.

శ్రీధర్‌ని పెళ్లిచేసుకుంది. పిల్లాడిని కన్నది. కారు, బంగళా సమకూర్చుకుంది. హైదరాబాద్‌లో హెడ్డాఫీసు తెరిచింది.

అందం చందం, డబ్బు, డాషింగ్‌నెస్, వ్యాపారంలో సమర్థత దీపికకి సంఘంలో మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి.

దీపిక ఇంటా బయటా కూడా తనేమిటో నిరూపించుకుంది.

తను...

సంసారం ఘోరంగా విఫలమై పుట్టింటికి తిరిగి వచ్చింది.


ఒక పశువుతో తన పెళ్లి జరగడం, ఆ పశువు తనని హింసించి, ఆఖరుకు చంపెయ్యాలని చూడడం, తను ఎలాగో బయటపడి... ఇక అక్కడ బతకలేనని తెల్పి విడాకులు తీసుకోవడం...

అన్నీ ఎంత వేగంగా జరిగిపోయాయి. ఆ

## గుండెపై ఏనుగు

తెలుగువాడైన కోడి రామమూర్తికి 'ఇండియన్ హెర్క్యులిస్' అనే బిరుదు ఉండేది. ఆయన 7000 పౌనుల బరువుండే ఏనుగుని రొమ్ముమీద ఎక్కించుకుని 5 నిముషాలు ఉండేవాడట.

— పచ్చిగోళ్ళ సుధ



కష్టాలు చాలవన్నట్లు, పీడకలలాంటి సంసార జీవితానికి గుర్తుగా ఒక పిల్ల...

దేవుడా... అసలు నన్నెందుకు పుట్టించావు.

గీతిక ఏడుస్తోంది. ఏడుస్తూ ఆలోచిస్తోంది.

అతను తనని చూసి జాలిపడి చేసుకున్నా అదోవిధంగా వుంటుంది. కానీ ఇప్పుడు జాలిగా కూడా కాదు.

ఎవరో చెప్పారని తనని చేసుకుంటాడన్న మాట.

తమ పెళ్లవుతుంది.

ఆ తర్వాత... వాళ్లిద్దరూ ఛెస్ ఆడుతుంటారు. షేకాడుతుంటారు...

తను టిఫిన్ ప్లేట్లు అందిస్తూ వుంటుంది. ఏమనడానికీ వుండదు. ఎందుకంటే అప్పుడు తన బతుకే దీపిక దయాభిక్షం అయిపోతుంది కాబట్టి.

ఇప్పుడేం చేయాలి.

గీతికకి భరింపరాని ఉక్రోషం, దిగులు, ఏడుపు కలిగాయి.

□ ■ □

ప్రకాష్ గురించి చెప్పాక గీతిక ఎందుకో చాలా సీరియస్‌గా అయిపోయింది. అడిగినదానికి జవాబు చెప్పడం తప్ప మరేం మాట్లాడడంలేదు.

అసలు తీరిగ్గా మాట్లాడితేగానీ, గీతిక మనసులో ఏముందో తెలీదు.

రోజూ ఏదో ఒక హడావుడి. ఇవాళ ఒక పార్టీని అటెండవడమే తప్ప మరేం పనిలేదు. ఆ పని ప్రకాష్‌కి అప్పగించి ఇంటికి బయల్దేరింది దీపిక.

కింద పనిమనిషి అంట్లు తోముతోంది. గీతని సర్‌ప్రైజ్ చేద్దామనిపించింది దీపికకి. నిశ్శబ్దంగా అడుగులు వేస్తూ గీతిక గదిలోకి వెళ్లింది.

గీతిక లేదు. బాత్‌రూంలోకూడా లేదు. ఇంటిచుట్టూ చూసింది.

గీతిక ఎక్కడా లేదు.

వంటింట్లో ఏదో అలికిడైనట్లనిపించింది.

మెల్లగా అడుగులు వేసింది.

వంటింట్లో అడుగు పెట్టబోతూ అదిరిపడింది దీపిక.

అక్కడ...

నిలువెల్లా కిరసనాయిల్‌తో స్నానం చేసిన గీతిక... అగ్గిపుల్ల తీసుకుని అంటించుకోబోతోంది.

అంతే...

ఒక్క ఉదుటున ముందుకి దూకి, గీతిక చేతిలోంచి అగ్గిపెట్టె లాగి అవతల పారేసింది దీపిక.

పక్కనే వున్న బిందె ఎత్తి, నీళ్ల ధడాల్న గీతిక ఒంటిమీద కుమ్మరించింది.

"ఏం పుట్టిందే నీకు. ఎందుకిలా చస్తున్నావ్" అని అరిచేసింది కోపంగా.

గీతిక అసహనంగా చూస్తోంది.

ఇంత అధాట్టుగా, దీపిక ఎట్లా, ఎక్కడ్నుంచి ఊడి పడింది.

తన ప్రయత్నం భగ్నమైపోయినందుకు ఎక్కడలేని ఉక్రోషం వచ్చేసింది.

"నన్ను చావనీ" అంది కోపంగా చూస్తూ.

"ఎందుకూ చావటం"

"చావక మరేం చెయ్యమంటావు. నువ్వె

వడినో చూపిస్తే కట్టుకుని, వాడితో కాపరం నీకు ఊడిగం చేస్తూ బతకమంటావు... అంతేనా''

దీపిక నిర్ఘాంతపోయింది.

''గీతా'' అంది.

''అవును. అసలేంటి నీ డామినేషన్. నా ఖర్మకి నా పెళ్లి పెటాకులయ్యింది. అందుకని... అందుకని నువ్వు ఎవరిని చేసుకోమంటే వాళ్లని చేసుకోవాలా. అదికూడా నిన్నొక దేవతలా చూస్తూ, నీ మెహర్బానీకి నన్ను చేసుకునే వ్యక్తితోనా పెళ్లి''

గీత మనసు దీపికకి పూర్తిగా అర్థమైంది. ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్...

అంతే... మరేం లేదు.

''మరి నువ్వు చస్తే నీ పిల్ల బతుకేమౌతుంది'' అంది.

''ఉన్నారుగా. అమ్మా నాన్నా... నువ్వూ...''

''అంటే... నువ్వు చచ్చి నీ పిల్లని నాకు బలిచేస్తావా. మరి నేను... రేప్పొద్దున దానిమీద మాత్రం డామినేషన్ చెయ్యనా'' నవ్వుతూ అడిగింది దీపిక.


''ఏదో చావండి. నేను చచ్చాక ఎవరెట్లా చస్తే నాకేం''

దీపిక మొహంలో చిరునవ్వు మెరిసింది.

''గీతా... నువ్వు నాకన్నా చిన్నదానివి. అంతేకాదు. బొత్తిగా అమాయకురాలివి. నీలో గడుసుతనం లేదు. నీకేం కావాలో నీకే తెలీదు. అమ్మా నాన్నా చెప్పిన సంబంధం చేసుకున్నావు. వాళ్లు పాత ధోరణిలో ఆలోచించి, నిన్ను తెలీకుండానే ఒక మృగానికి కట్టబెట్టారు. ఆ మృగాన్ని తప్పించుకుని మళ్లీ స్వేచ్ఛా జీవివయ్యావు. నిన్ను మళ్లీ హాయిగా చూడాలని, నీ బతుకులో వెన్నెల నిండాలనీ అనుకున్నాను. అది తప్పా...''

గీతిక మాట్లాడలేదు.

''గీతా... నాది డామినేషన్ కాదు. ప్రకాష్‌కి సహనం, మంచితనం వున్నాయి.



నీకు భర్తగా, నీ పిల్లకి తండ్రిగా తగిన వ్యక్తి. గీతా నువ్వు జీవితంలో అణగారిపోయావు. నీ అంతట నువ్వు పైకి లేవలేవనిపించింది. అందుకే నేనే నిన్ను లేపాలని ఆ ప్రయత్నంలో అత్యుత్సాహం చూపి వుంటే, అది నిన్ను భయపెడ్తే... నన్ను క్షమించు'' అన్నది.

''నిన్ను క్షమించడానికి నేనెవర్ని. నేను నీకన్నా అన్నివిధాలా తక్కువ''

''కాదు. నీకూ, నాకూ భేదమేముంది. ఇద్దరం ఒకే తల్లిదండ్రులకి పుట్టాం. సమానంగా చదివాం... సమానావకాశాలు పొందాం...''

''నీ తెలివి నాకెక్కడిది'' మొహం తిప్పేసుకుంది గీత.

''తెలివికాదు. ఆత్మవిశ్వాసం... ధైర్యం. అవి ఎవరో ఇస్తే రావుగీతా. ఎవరికి వారు అలవర్చుకోవాలి''

''ధైర్యం నాకూ వుంది''

''వుంటే ఒక్కనాటికీ ఇలా చావాలని ప్రయత్నించేదానివి కాదు''

గీతిక మాట్లాడలేదు. దీపిక గీతిక మొహం తనవైపు తిప్పుకుంది.

''గీతా ... నీకూ నాకూ తేడా ఏమిటో అర్థమైందా. ఆత్మస్థైర్యం. దానితోటే నేను బతకగలుగుతున్నాను. అదిలేక నువ్వు చావాలనుకుంటున్నావు. ఇప్పుడు నీకు చావాల్సిన అవసరం ఏముంది చెప్పు. ఇష్టమైతే ప్రకాష్ ని చేసుకుంటావు. లేకపోతే మానుకుంటావు. అంతే. చాలామందికన్నా నువ్వు గొప్ప స్థితిలోనే వున్నావు. నీకు అమ్మా నాన్నా అండ వుంది. కొద్దో గొప్పో డబ్బుంది. బతకగలవు''

''గట్టున కూర్చుని మాట్లాడడం కాదు. నేనెంత బాధపడుతున్నానో నీకు తెలీదు. నువ్వు నా స్థితిలో వుంటే ఏం చేస్తావు''

''ఏం చేస్తానా. ఇష్టమైతే ప్రకాష్ని చేసుకుంటాను. లేకపోతే నా దారిన నేను హాయిగా బతుకుతాను. చావడం దేనికీ... ఒక్కసారి ఆలోచించు. బతికుంటే ఎప్పుడైనా చావొచ్చు. కానీ చచ్చావంటే మాత్రం మళ్లీ బతకలేవు. ఈ బతుకు దేవుడిచ్చిన వరం. దీన్ని అర్థం లేని అనుమానాలతో, న్యూనతాభావంతో, దిగులుతో నాశనం చేసుకోకు. హాయిగా బతుకు. ఇక్కడ ఎవరూ ఎవరికన్నా తక్కువ కాదు. అంతా సమానమే. అంతే. నువ్వు ఎవరికన్నా తక్కువ కాదు. గీతా... కష్టాలెన్ని ఎదురైనా ఎదుర్కొంటూ బతకడమే జీవితం... బతకడానికి నీ పిడికెడు గుండెలో రవంత ఆశ నింపుకో, చాలు... అది లేకే ఇలా డిప్రెషన్ తో కుంగిపోతున్నావు... నీకు నేనింక ఏమీ చెప్పను. ఇంత చెప్పినా నువ్వు చావాలనే అనుకుంటే నిరభ్యంతరంగా చావు'' దీపిక ముందుకి నడిచింది.

ఒకసారి ఆగి వెనక్కి తిరిగి చూసింది.

గీతిక ఏదో ఆలోచిస్తోంది.

''గీతా... నా పరిస్థితిలో నువ్వుంటే ఏమనేదానివో తెల్సా... చస్తే చావుగానీ... నా ఇంట్లో మాత్రం చావకు అనేదానివి. కానీ, నేవలా అనను. పిరికితనం, పలాయనవాదం నాకు లేవు. ఏం పర్వాలేదు. నీ చావు మూలంగా వచ్చే సమస్యల్ని ఎదుర్కొంటాను. హాయిగా చావటానికి ఇది సరైనచోటు.

అంత కోరికగా చావాలనుకుంటున్న నా చెల్లెలు సుఖంగా చావడమే నాకు సంతోషం. కాకపోతే... కిరసనాయిల్ చావుకన్నా సుఖమైన చావు వుంటే చూసుకో'' అంది.

నేరుగా ఆఫీసుకి వెళ్లిపోయింది.

ఆరు గంటలకి ఇంటికి వెళ్తుంటే ...

గీతిక ఏం చేస్తోందా అని ఆలోచన...

తన మాటలు దాని బుర్రలోని మురికిని శుభ్రంగా కడిగిపారేసి వుంటాయి. తన అంచనా నిజమైతే ఇక ఆత్మహత్య జోలికి పోదు.

కారు చప్పుడు వింటూనే కిందికి వచ్చేసింది గీతిక. ఆమె కళ్లల్లో ఉత్సాహం... మొహంలో మెరుపు... బతుకునీ, భవిష్యత్తునీ ఎదుర్కోగలననే ధైర్యం... ఓపిక కళ్లు గ్రహించాయి.

నవ్వుతూ దీపిక చెయ్యి పట్టుకుని లోపలికి నడిచింది గీతిక.

